సాక్షి
మెదక్
ఆదివారం । 13 । జూలై । 2025

హరిత హీరోలు

పర్యావరణాన్ని పరిరక్షించడంలో చెట్ల పాత్ర విస్మరించలేనిది. అందుకే వృక్షో రక్షతి రక్షితః అంటారు పెద్దలు. చెట్లను మనం కాపాడితే అవి మనల్ని కాపాడతాయనేది ఈ సూక్తి అర్థం. దీనిని మనసా వాచా కర్మణా ఆచరిస్తూ తమకున్న ఆసక్తి కొద్దీ ఇంటా బయటా మొక్కలను నాటి వనాలు సృష్టిస్తున్నారు. మనిషికి ప్రాణవాయువును అందించే చెట్లను విరివిగా పెంచుతూ అటు పర్యావరణాకి, ఇటు మానవాళికి ఇతోధికంగా తమవంతు సాయపడుతున్న హరిత హీరోలపై ఈ వారం సండే స్పెషల్.

8లో



న్యూస్‌రీల్

బగలాముఖీని దర్శించుకున్న న్యాయమూర్తి



అమ్మవారి చిత్రపటంతో న్యాయమూర్తి

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రంలో కొలువైన బగలాముఖీ శక్తి పీఠాన్ని శనివారం జిల్లా న్యాయమూర్తి నీలిమ దర్శించుకున్నారు. ఈసందర్భంగా వేద పండితుడు శాస్త్రుల వెంకటేశ్వరశర్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు, జ్ఞాపిక అందజేశారు. శక్తిపీఠం విశిష్టత, నిర్మాణం గురించి న్యాయమూర్తికి వివరించారు. కార్యక్రమంలో పబ్బ రమేష్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.

42 శాతం రిజర్వేషన్లు చరిత్రాత్మకం



సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రుల చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నేతలు

నర్సాపూర్: బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ సీఎం రేవంత్‌రెడ్డి తీసుకున్న నిర్ణయం చరిత్రాత్మకమని డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డిలు అన్నారు. శనివారం పార్టీ క్యాంపు కార్యాలయంలో సీఎం రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్, మంత్రులు దామోదర రాజనర్సింహ, వివేక్, పొన్నం ప్రభాకర్ చిత్రపటాలకు నాయకులతో కలిసి క్షీరాభిషేకం చేశారు. ప్రభుత్వ నిర్ణయంతో బీసీ వర్గాల్లో ఆనందం నెలకొందని అన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.


కాయకల్ప పురస్కారానికి ఖేడ్ ఆస్పత్రి ఎంపిక

నారాయణఖేడ్: 2024– 25 సంవత్సరానికి ఖేడ్ ప్రాంతీయ ఆస్పత్రిని కాయకల్ప పురస్కారానికి కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేసిందని ఆస్పత్రి సూపరింటెండెంట్ రమేశ్ శనివారం తెలిపారు. ఆస్పత్రిలో ఉన్నత ప్రమాణాలతో అందిస్తున్న నాణ్యమైన ఆరోగ్యసేవలు, పరిశుభ్రత తదితర వాటికి సంబంధించి ఈ పురస్కారానికి ఎంపికైనట్లు చెప్పారు. ఆస్పత్రి అభివృద్ధి సంస్థ చైర్మన్, ఎమ్మెల్యే సంజీవరెడ్డి మద్దతు, ఎంపీ సురేష్ షెట్కార్ సహకారం, సిబ్బంది అంకిత భావంతో పనిచేస్తుండటం వల్లే ఇది సాధ్యమైందని వివరించారు.

విద్యార్థులు కష్టపడి చదవాలి

పటాన్‌చెరు టౌన్: విద్యార్థులు కష్టపడి చదివితే అనుకున్న లక్ష్యాన్ని చేరుకుంటారని ఇంటర్మీడియెట్ జిల్లా అధికారి గోవిందరావు అన్నారు. శనివారం అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని పటేల్‌గూడలో ఐఐటీ చుక్కా రామయ్య ఇష్టా జూనియర్ కళాశాల ఫ్రెషర్స్ డే వేడుకలను ఓ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పుట్టినప్పుడు ఉయ్యాల్లో వేస్తారు, చనిపోయినప్పుడు నలుగురు మోస్తారు. ఈ మధ్యలో మనం ఏదో చేయాలనే తపన ఏర్పడాలన్నారు. అనంతరం డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఇంటర్ దశలోనే మంచి గోల్ పెట్టుకొని కష్టపడితే అనుకున్న లక్ష్యాన్ని సాధిస్తారని అన్నారు. చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ చదువు మీద దృష్టి పెట్టాలని సూచించారు.

ఏడాది పాటు సీపీఐ వందేళ్ల ఉత్సవాలు



సమావేశంలో మాట్లాడుతున్న చాడ వెంకట్‌రెడ్డి

హుస్నాబాద్: సీపీఐ ఆవిర్భవించి వందేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆ పార్టీ చేసిన త్యాగాలు, పోరాటాలు, ప్రజాఉద్యమంలో సాధించిన విజయాలపై ఏడాదిపాటు సీపీఐ వందేళ్ల ఉత్సవాలను నిర్వహించనున్నట్లు సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని సీపీఐ భవన్‌లో శనివారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చాడ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ...కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అరచేతిలో వైకుంఠం చూపెడుతూ జిమ్మిక్కుల పాలన కొనసాగిస్తుందన్నారు. దేశంలో కార్పొరేట్ శక్తులు సహజ వనరులను కొల్లగొడుతూ లక్షల కోట్లకు పడగలెత్తుతున్నారని ఆరోపించారు. ఆర్థిక నేరస్తులైన విజయ్ మాల్యా, నీరవ్ మోదీ, లలిత మోదీ వంటి దొంగలకు ప్రధాని మోదీ వత్తాసు పలుకుతున్నారని తెలిపారు.

చెరువులు నింపని వాన

ముఖం చాటేసిన వరుణుడు
- ముందుకు సాగని వ్యవసాయ పనులు
- ఆందోళనలో అన్నదాతలు
- బోర్ల కింద జోరుగా సాగు..

వరుణుడు ముఖం చాటేయడంతో జిల్లాలో వ్యవసాయ పనులు ముందుకు సాగడం లేదు. అడపాదడపా కురుస్తున్న వానలతో రైతుల్లో ఆశలు చిగురిస్తున్నా.. మరోవైపు ఆందోళన తప్పడం లేదు. జిల్లాలో ఇప్పటివరకు చెరువులు, కుంటల్లో నీరు చేరేంత వర్షాలు పడలేదు. మేలో కురిసిన వర్షాలతోనే ప్రస్తుతం రైతులు బోర్ల కింద సాగు చేస్తున్నారు.

– మెదక్ కలెక్టరేట్

జిల్లాలో గతేడాది ఈ సమయానికి 171 మి.మీ వర్షం కురవగా, ఈఏడాది ఇప్పటివరకు 142.3 మి.మీ వర్షపాతం నమోదైంది. కానీ ఎక్కడా చెరువులు, కుంటల్లో నీరు చేరలేదు. కాగా మేలో కురిసిన భారీ వర్షాలతో భూగర్భజలాలు మెరుగుపడ్డాయి. దీంతో బోర్లలో నీటి ఊటలు పెరిగాయి. వాటిపై ఆధారపడిన రైతులు ప్రస్తుతం వరి సాగు చేస్తున్నారు. చెరువులు, కుంటలు, వర్షాలపై ఆధారపడిన వారు దుక్కులు దున్ని ఆకాశం వైపు ఆశగా ఎదురుచూస్తున్నారు. వారం రోజుల క్రితం వర్షాలు కురిసినప్పటికీ ఆశించిన స్థాయిలో పడలేదని రైతులు వాపోతున్నారు. నాట్లు వేసేంత నీరు రాలేదని చెబుతున్నారు. జూన్ నుంచి ఇప్పటివరకు 142.3 మి.మీ వర్షం పడింది. అది కూడా భారీగా కాకుండా విడతల వారీగా కురిసింది. ఇదే సమయంలో ఎండలు మండుతుండటంతో ఎక్కడికక్కడే వర్షం నీరు ఆవిరైపోతుంది. దీంతో జిల్లాలోని ఒక్క చెరువు, కుంట పూర్తిస్థాయిలో నిండలేదు. కాగా జిల్లాలో ఈ ఏడాది ఇప్పటివరకు కొల్చారం మండలంలో అత్యధికంగా 193 మి.మీ వర్షం కురవగా, మనోహరాబాద్ మండలంలో అత్యల్పంగా 53 మి.మీ కురిసింది. మొత్తం 2,694 చెరువులు ఉండగా, ఒక్క చెరువు కూడా పూర్తిస్థాయిలో నిండలేదు.

జిల్లాలో పంటల సాగు ఇలా..

జిల్లాలో వరి సాగు అంచనా 3,05,100 ఉండగా, ఇప్పటివరకు 7 వేల ఎకరాల్లో మాత్రమే సాగైంది. మరో 11 వేల ఎకరాలకు రైతులు నారుపోసి నాటు వేసుకునేందుకు సిద్ధంగా ఉన్నారు. ఆరుతడి పంట అయిన పత్తి అంచనా 37,200 కాగా, ఇప్పటివరకు 33 వేల ఎకరాల్లో సాగు చేశారు. అలాగే మొక్కజొన్న 2,640 ఎకరాల అంచనా ఉండగా, ఇప్పటివరకు కేవలం 600 ఎకరాల్లో సాగైనట్లు వ్యవసాయ అధికారులు తెలిపారు.



అడుగంటిన నర్సాపూర్ మండలం రాంచంద్రాపురం చెరువు



నీరులేక వెలవెలబోతున్న చేగుంట మండలం పొలంపల్లి చెరువు

జిల్లాలో నమోదైన వర్షపాతం వివరాలు

మండలం	వర్షపాతం మి.మీ
కొల్చారం	193.0
పెద్దశంకరంపేట	151.9
రేగోడ్	161.7
అల్లాదుర్గం	159.4
టేక్మాల్	145.7
పాపన్నపేట	135.6
హవేళిఘణాపూర్	175.1
రామాయంపేట	172.3
నిజాంపేట	174.2
చేగుంట	164.1
నార్సింగి	129.8
చిన్నశంకరంపేట	152.9
మెదక్	168.7
చిలప్‌చెడ్	113.7
కౌడిపల్లి	107.6
నర్సాపూర్	108.1
శివ్వంపేట	131.2
వెల్దుర్తి	145.7
తూప్రాన్	152.0
మాసాయిపేట	92.7
మనోహరాబాద్	53.9

వరి నారు పెరుగుతుంది



చెరువు, కుంటలు వెలవెలబోతున్నాయి. బోర్లున్న రైతులు నాట్లు వేసుకుంటున్నారు. దుక్కులు దున్ని వానల కోసం ఆకాశం వైపు చూస్తున్నాం. వర్షం పడితేనే నాట్లు సాగుతాయి. వరి నారు కూడా పెరుగుతుంది. ఎంఎస్, ఎఫ్ఎస్ కెనాళ్ల నుంచి నీరు కూడా రావడం లేదు.

– గజ్జెల బాలపోచయ్య, మద్దుల్వాయి

ఎంసీహెచ్‌లో సంపూర్ణ వైద్య సేవలు

కలెక్టర్ రాహుల్‌రాజ్



బాలింతతో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్‌జోన్/మెదక్ కలెక్టరేట్: మాతా, శిశు సంరక్షణ ఆరోగ్య కేంద్రంలో గర్భిణులకు, బాలింతలకు సంపూర్ణ వైద్య సేవలు అందుతున్నాయని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఆస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. నవజాత శిశువుల ప్రత్యేక విభాగాన్ని పరిశీలించి వారికి అందుతున్న వైద్య సేవల గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆస్పత్రిలో జూన్‌లో 350 ప్రసవాలు నిర్వహించారన్నారు. ఫ్యామిలీ ప్లానింగ్‌కు సంబంధించి 50 మేజర్ సర్జరీలు జరగటం హర్షణీయం అన్నారు. ప్రతి పీహెచ్‌సీ పరిధిలో గర్భిణులను ఎప్పటికప్పుడు ఆశావర్కర్లు, ఏఎన్ఎంలు పరిశీలించి ఎంసీహెచ్‌కు తరలించి ప్రసవాలతో పాటు వైద్యం అందిస్తున్నారన్నారు. ఆస్పత్రిలో ఎలాంటి సమస్యలు ఉత్పన్నమైనా తన దృష్టికి తీసుకురావాలని సిబ్బందికి సూచించారు. కలెక్టర్ వెంట ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సునీతతో పాటు వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ గిరిజన బాలుర కళాశాల వసతి గృహాన్ని సందర్శించారు. హాస్టళ్ల మరమ్మతులకు రూ. 2.21 కోట్లు మంజూరైనట్లు తెలిపారు.

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలి

పరిగి ఎమ్మెల్యే, జిల్లా సంస్థాగత ఎన్నికల ఇన్‌చార్జి రాంమోహన్‌రెడ్డి



రాంమోహన్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్: అతిత్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ విజయానికి కార్యకర్తలు సమన్వయంతో కృషి చేయాలని పరిగి ఎమ్మెల్యే, పార్టీ సంస్థాగత ఎన్నికల జిల్లా ఇన్‌చార్జి రాంమోహన్‌రెడ్డి సూచించారు. ఖేడ్‌లోని ఓ ఫంక్షన్‌హాల్‌లో శనివారం నిర్వహించిన నియోజకవర్గస్థాయి కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ప్రజాపాలనలో రాష్ట్రం ఎంతో అభివృద్ధి చెందుతోందన్నారు. అర్హులైన పేదలకు సంక్షేమ పథకాలను అందించడం జరుగుతోందని గుర్తు చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి వివరించాలన్నారు. టీజీఐఐసీ చైర్మన్ నిర్మలా జగ్గారెడ్డి, జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్, ఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, వాటి ద్వారా లబ్ధిపొందుతున్న విషయాలను సమగ్రంగా వివరించారు. జనాభా దామాషా ప్రకారం బీసీలకు సమానా వాటా దక్కాలనే ఉద్దేశంతో రిజర్వేషన్లను 42 శాతానికి పెంచడం జరుగుతోందన్నారు. టీపీసీసీ సభ్యులు శంకరయ్యస్వామి, డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, ఆనంద్ స్వరూప్ షెట్కార్, వినోద్‌పాటిల్, మాజీ ఎంపీపీ, జెడ్పీటీసీలు, ఆయా మండలాల పార్టీల అధ్యక్షులు నియోజకవర్గంలోని కాంగ్రెస్‌పార్టీ, అనుబంధ సంఘాల బాధ్యులు, మాజీ ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్టీసీకి మహిళా సంఘాల బస్సులు





సంగారెడ్డి జోన్: గ్రామీణ ప్రాంతాల్లోని మహిళా సంఘాలు ఆర్థిక సాధికారత సాధించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇప్పటికే పలు రంగాలలో అవకాశాలు కల్పిస్తుండగా, మహిళా సంఘాల ద్వారా బస్సులను కొనుగోలు చేసి ఆర్టీసీకి అద్దెకు ఇచ్చేందుకు కసరత్తు చేస్తుంది.

జిల్లాకు 20 బస్సులు కేటాయించే అవకాశం

రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇందిరా మహిళా శక్తి కార్యక్రమంతో గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో అనేక రకాల కార్యక్రమాలు చేపట్టింది. అందులో భాగంగా ఇప్పటికే మహిళా శక్తి క్యాంటీన్లు, మిల్క్‌పార్లర్లు, మహిళా పెట్రోల్ బంక్, పాఠశాల విద్యార్థులకు యూనిఫాం కుట్టడంతో పాటు వివిధ రకాలు యూనిట్లు ప్రవేశపెట్టింది. ఈక్రమంలో మహిళా శక్తి పథకం ద్వారా 600 బస్సులు కొనుగోలు చేసి ఆర్టీసీకి అద్దెకు ఇవ్వాలని నిర్ణయించింది. అందులో భాగంగా జిల్లాకు 20 బస్సుల వరకు అప్పగించే అవకాశం ఉంది.

మరింత ఆదాయం

జిల్లాలో ఉన్న మండల మహిళా సమాఖ్య సభ్యులతో అద్దె బస్సులు ఇవ్వనున్నారు. రుణాలు తీసుకొని తిరిగి చెల్లించడంలో ఆలస్యం చేయకుండా ఉండటంతో పాటు వివిధ రకాల అర్హతలను పరిశీలించి సంఘాలను ఎంపిక చేయనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం కమ్యూనిటీ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్ గ్రాంట్ ద్వారా రూ. 30 లక్షలు, సమాఖ్య సభ్యులతో రూ. 6 లక్షలు ఇప్పించి బస్సులను కొనుగోలు చేయనుంది. ఆ బస్సులను ఆర్టీసీకి అద్దెకు ఇవ్వనున్నారు. సంస్థ ప్రతి నెల సంబంధిత సభ్యులకు నెలకు సుమారు రూ. 70 వేలు చెల్లించనుంది. దీంతో సుమారు రూ. 14 లక్షల ఆదాయం సమకూరనుంది. ఫలితంగా మహిళలకు మరింత ఆదాయం పెరిగే అవకాశాలు ఉన్నాయి.

జిల్లా వివరాలు

జిలా మహిళా సమాఖ్య	1
మండల మహిళా సమాఖ్యలు	25
గ్రామ మహిళా సమాఖ్యలు	695
మహిళా గ్రూపులు	18,488
గ్రూపులలోని మహిళా సభ్యులు	1,91,455

అన్నిరంగాల్లో అభివృద్ధి: దామోదర



సంగారెడ్డిజోన్: ప్రజా సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం చేపట్టే సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు వివరించాలని వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. శనివారం సంగారెడ్డిలోని తన నివాసంలో అందోల్ నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీలను దశలవారిగా అమలు చేస్తున్నామన్నారు. ఇందిరమ్మ ఇళ్లు, గృహజ్యోతి, రైతు భరోసా, భూ భారతి, రైతు రుణ మాఫీ, రైతు బీమాను అమలు చేయడంతో పాటు పెన్షన్లు, కొత్త రేషన్‌కార్డుల జారీ, సన్నబియ్యం, ధాన్యం కొనుగోళ్లు, సన్నాలకు రూ. 500 బోనస్ అమలు చేస్తున్నామని వివరించారు. ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమాన్ని అభివృద్ధిని ప్రజలకు వివరించాలని కార్యకర్తలకు సూచించారు. అందోల్ నియోజకవర్గాన్ని అభివృద్ధిలో ఆదర్శంగా నిలుపుతానని పేర్కొన్నారు. కార్యక్రమంలో జహీరాబాద్ ఎంపీ సురేష్‌కుమార్ షెట్కార్, టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలారెడ్డి, పీసీసీ ఉపాధ్యక్షుడు సంగమేశ్వర్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య, సిలారపు త్రిష, పీసీసీ సభ్యుడు కిషన్, ఏఎంసీ చైర్మన్లు సుధాకర్‌రెడ్డి, జగన్మోహన్‌రెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్లు మల్లారెడ్డి, కచూర్‌రావు, మాజీ మున్సిపల్ చైర్మన్ మల్లయ్య, వివిధ మండలాల కాంగ్రెస్ అధ్యక్షులు దిగంబరరావు, శేషారెడ్డి, రమేష్, నిమ్మ రమేష్ పాల్గొన్నారు.

డబుల్ బెడ్రూంల తాళాలు ఇవ్వండి



డబుల్ బెడ్రూం ఇళ్ల వద్ద లబ్ధిదారుల ఆందోళన

జహీరాబాద్ టౌన్: హోతి(కె) వద్ద నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్ల తాళాలను ఇవ్వాలని డిమాండ్ చేస్తూ లబ్ధిదారులు ఆందోళనకు దిగారు. సీపీఎం ఆధ్వర్యంలో శనివారం లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో డబుల్‌బెడ్రూంకాల నీకి తరలివచ్చారు. గత ప్రభుత్వంలో కేటాయించిన ఇళ్లను ఎందుకు అప్పగించడం లేద ని, 12 తేదీన ఇళ్ల తాళాలు ఇస్తామని చెప్పి ఎందుకు వాయిదా వేశారని ప్రశ్నించారు. తాళాలు ఇచ్చే వరకు ఇక్కడి నుంచి కదలమని బైఠాయించారు. జహీరాబాద్ రూరల్ ఎస్ఐ కాశీనాథ్ ఆందోళన కారులతో మాట్లాడారు. రెండవ శనివారం ఇళ్ల కేటాయింపు వాయిదా పడిందని, మరో రోజు అప్పగిస్తారని నచ్చజెప్పారు. అక్కడి నుంచి లబ్ధిదారులు పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి ధర్నా చేశారు. ఈసందర్భంగా సీపీఎం నాయకుడు మహిపాల్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభు త్వం హోతి(కె) వద్ద పేదల కోసం 660 ఇళ్లను కట్టించగా అధికారులు డ్రా ద్వారా లబ్ధిదారులకు సర్టిఫికెట్లను పంపిణీ చేశారని చెప్పారు.

పెరగనున్న బీసీ పాలకులు

42 శాతం రిజర్వేషన్ అమలైతే 206 మందికి అవకాశం



మెదక్‌జోన్: బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలుకు రాష్ట్ర ప్రభుత్వం ఆర్డినెన్స్ జారీ చేయాలని తీర్మానించింది. ఇది అమలైతే రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ నేతలకు అధిక మొత్తంలో రాజ్యాధికారం దక్కనుంది. జిల్లాలో 2018లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో 469 గ్రామ పంచాయతీలు, 4,086 వార్డులు ఉండగా, గత ప్రభుత్వం కొత్తగా 23 పంచాయతీలను ఏర్పాటు చేసింది. దీంతో జిల్లాలో పంచాయతీల సంఖ్య 492కు చేరుకుంది. అలాగే అప్పట్లో వార్డులు 4,086 ఉండగా, కొత్తగా 134 వార్డులను కొత్తగా ఏర్పాటు చేయటంతో వాటి సంఖ్య 4,220కి చేరుకుంది. ఈ నేపథ్యంలో అప్పటి రిజర్వేషన్ ప్రకారం సర్పంచ్‌లు ఎస్టీలకు 80, ఎస్సీలకు 66, బీసీలకు 120 కాగా, ఇతరులు 203 మంది ఉన్నారు. కాగా ఈ రిజర్వేషన్‌లో సుమారు సగం మంది మహిళలు కాగా, మిగితా సగం మంది పురుషులు ఉన్నారు.

మండల, జిల్లా పరిషత్‌లోనూ ..

గతంలో జిల్లావ్యాప్తంగా 189 ఎంపీటీసీలు ఉండగా, అప్పటి 22 శాతం రిజర్వేషన్ ప్రకారం బీసీలకు 41 సీట్లు లభించాయి. కాగా ఇటీవల ఒక ఎంపీటీసీ స్థానం పెరగటంతో ఆ సంఖ్య 190కి చేరుకుంది. ఈ లెక్కప్రకారం 42 శాతం రిజర్వేషన్ అమలైతే బీసీలకు 79 సీట్లు దక్కనున్నాయి. అలాగే ఎంపీపీలు, జెడ్పీటీసీలు గతంలో 20 చొప్పున ఉండగా, నూతనంగా మాసాయిపేట మండలాన్ని ఏర్పాటు చేయటంతో ఎంపీపీలు 21, జెడ్పీటీసీ స్థానాలు 21కి చేరుకున్నాయి. కాగా నూతన రిజర్వేషన్ అమలైతే బీసీలకు 8 సీట్ల చొప్పున పాలనాపరమైనా స్థానం కైవసం కానుంది.

బీసీ రిజర్వేషన్ అమలైతే..

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలైతే, ప్రస్తుతం జిల్లాలో 492 గ్రామ పంచాయతీలకు గానూ ఎస్సీ, ఎస్టీలకు అప్పటి రిజర్వేషన్ అమలు కాగా, ఇతరుల రిజర్వేషన్‌లో కోతపడి బీసీలకు 206 మందికి పదవులు దక్కే అవకాశం ఉంది. అలాగే ఎస్సీలకు 66, ఎస్టీలకు 80, మిగితా 140 సీట్లలో ఇతరులు, (ఓసీలకు) అవకాశం ఉంటుంది. అలాగే వార్డు మెంబర్లకు సైతం ఇదే తరహా రిజర్వేషన్లు వర్తించనుంది.

పురభివృద్ధికి నిధులు!

- జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీలకు రూ. 60 కోట్లు
- ప్రతిపాదనలు పంపిన అధికారులు
- త్వరలో విడుదల చేయనున్న ప్రభుత్వం



రామాయంపేటలో బీసీ కాలనీకి వెళ్లే ప్రధాన రహదారి దుస్థితి

రామాయంపేట(మెదక్): పట్టణాల్లో నెలకొన్న సమస్యలతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఏ పని చేయాలన్నా నిధుల కొరతతో అధికారులు తలలు పట్టుకుంటున్నారు. దీంతో మున్సిపాలిటీల్లో అభివృద్ధి కుంటుపడింది. ఇప్పటికే అధికారులు పలుమార్లు ప్రతిపాదనలు పంపినా నిధుల మంజూరు కాలేదు. తాజాగా ప్రభుత్వం పట్టణాల్లో నెలకొన్న సమస్యలపై దృష్టి సారించింది. ఈ మేరకు త్వరలో నిధులు మంజూరు చేయడానికి కసరత్తు చేస్తుంది. కాగా ఆయా మున్సిపాలిటీల పరిధిలో నెలకొన్న సమస్యలను గుర్తించిన అధికారులు జిల్లాలోని మెదక్, రామాయంపేట, నర్సాపూర్, తూప్రాన్ మున్సిపాలిటీల పరిధిలో అభివృద్ధి పనుల నిమిత్తం రూ. 60 కోట్లు మంజూరు చేయాలని తాజాగా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు.

పేరుకుపోయిన సమస్యలు

జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీల పరిధిలో పేరుకుపోయిన సమస్యలతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. సీసీ రోడ్లు, మురుగు కాలువలు పాక్షికంగా శిథిలమై రోడ్లపై మురుగు నీరు పారుతుంది. ఇళ్ల మధ్య నిలిచిన మురుగుతో ప్రజారోగ్యంపై ప్రభావం చూపుతోంది. కొన్నిచోట్ల మురుగు కాలువల్లో నుంచి వేసిన పైపులైన్లతో తాగు నీరు కలుషితమవుతోంది. విలీన గ్రామాల్లో పారిశుద్ధ్య సమస్య తీవ్రంగా వేధిస్తోంది. రహదార్లను ఆనుకొని ఉన్న పెంటకుప్పలతో దుర్వాసన వెదజల్లుతుంది. ఫలితంగా దోమల బాధ పెరిగిపోయింది. రామాయంపేట మున్సిపాలిటీలో అభివృద్ధి పూర్తిగా కుంటుపడింది.

పాలకవర్గాల హయాంలోనే..

జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీల్లో పాలకవర్గాల గడువు ముగియముందే ఆయా వార్డుల్లో చేపట్టాల్సిన పనుల గురించి చర్చించి ఆమోదం తెలిపాయి. ప్రధానంగా రహదారులు, మురుగు కాలువలు, వీధి దీపాలు, ఇతర సమస్యల పరిష్కారానికి నిధులు మంజూరు కాకపోవడంతో పనులు ప్రారంభం కాలేదు. తాజాగా ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు అత్యవసరంగా చేపట్టాల్సిన పనుల నిర్వహణకు త్వరలో నిధులు మంజూరు కానున్నాయి.

ప్రతిపాదనలు పంపాం



మున్సిపాలిటీలకు ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తే చాలా వరకు సమస్యలు పరిష్కారమయ్యే అవకాశం ఉంది. ఈ మేరకు తాము ప్రతిపాదనలు పంపాం. మంజూరయ్యే నిధులతో సీసీ రోడ్లు, మురుగు కాలువలతో పాటు ఇతర ప్రాధాన్యత గల పనులకు సంబంధించి నిర్మాణాలు చేపడుతాం.

– దేవేందర్, మున్సిపల్ కమిషనర్, రామాయంపేట

క్లుప్తంగా

యువతి అదృశ్యం

వర్గల్(గజ్వేల్): యువతి అదృశ్యమైన ఘటన వర్గల్ మండలం నాచారంలో చోటు చేసుకుంది. గౌరారం ఎస్సై కరుణాకర్‌రెడ్డి వివరాల ప్రకారం... ఉత్తరప్రదేశ్, సిద్ధార్థనగర్‌కు చెందిన ఆసియా ఖాతూన్(23) తన తల్లిదండ్రులతో కలిసి నాచారం సీడ్స్ కంపెనీలో పని చేస్తూ అక్కడే రూంలో ఉంటున్నారు. ఈ నెల 9న మధ్యాహ్నం ఆమె సామాను తీసుకొస్తానని తల్లిదండ్రులకు చెప్పి వెళ్లింది. తిరిగి ఇంటికి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు పలుచోట్ల వెతికినప్పటికీ ఆచూకీ లభించలేదు. యువతి తల్లి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బైక్‌ను ఢీకొట్టిన కంటైనర్

ప్రమాదంలో వ్యక్తి మృతి

చేగుంట(తూప్రాన్): రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండల కేంద్రమైన మాసాయిపేట శివారులోని 44వ నంబర్ జాతీయరహదారిపై శనివారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ చైతన్యకుమార్‌రెడ్డి వివరాల ప్రకారం ... తూప్రాన్ పట్టణానికి చెందిన అంతారం రాఘవేందర్(38) పరిశ్రమల్లో పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. పనుల కోసం చేగుంట వైపునకు బైకుపై వస్తున్నాడు. ఈ క్రమంలో వెనుక నుంచి వస్తున్న కంటైనర్ బైకును ఢీకొట్టడంతో తీవ్రగాయాలయ్యాయి. దీంతో రాఘవేందర్ అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అనారోగ్యంతో గల్ఫ్‌లో బెజ్జంకి వాసి మృతి

బెజ్జంకి(సిద్దిపేట): మండల కేంద్రానికి చెందిన ఉమ్మడి రామచంద్రస్‌చారి (45) గల్ఫ్‌లో అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. 15 ఏళ్లుగా దుబాయిలో ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తున్నాడు. ఈనెల 10న తాను పని చేస్తున్న ప్రదేశంలో కిందపడటంతో తోటి కార్మికులు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతునికి భార్య వసంత, ఇద్దరు కూతుర్లున్నారు. వారి కుటుంబాన్ని గల్ఫ్ సంక్షేమ సంఘం ప్రతినిధులు, నాయకులు తిరుపతి, శ్రీనివాస్ పరామర్శించి సానుభూతి తెలిపారు.

వరకట్నం కోసం వేధింపులు

అత్తింటి వారిపై కేసు నమోదు

అక్కన్నపేట(హుస్నాబాద్): అదనపు కట్నం కోసం భార్యను వేధిస్తున్న భర్తపై కేసు నమోదైంది. ఎస్‌ఐ చాతరాజు ప్రశాంత్ వివరాల ప్రకారం... మండలంలోని గౌరవెల్లి గ్రామానికి చెందిన స్వాతికి, సంగారెడ్డి జిల్లాకు చెందిన భానుప్రకాష్‌తో 2022లో వివాహం జరిగింది. పెండ్లి తర్వాత వీరిద్దరూ కొద్దిరోజులు కలిసిమెలిసి ఉన్నారు. భర్తతోపాటు అత్త, మామ అదనపు కట్నం తీసుకురావాలని స్వాతిని తరుచూ వేధిస్తున్నారు. ఈ క్రమంలో వీరిద్దరికి కౌన్సిలింగ్ ఇచ్చారు. అయినా వేధింపులు ఆగకపోవడంతో స్వాతి ఫిర్యాదు మేరకు పోలీసులు భర్త, అత్త, మామపై కేసు నమోదు చేశారు.

గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

వర్గల్(గజ్వేల్): గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని పోలీసులు శనివారం అరెస్టు చేశారు. గౌరారం సర్కిల్ కార్యాలయంలో గజ్వేల్ రూరల్ సీఐ మహేందర్‌రెడ్డి కేసు వివరాలు వెల్లడించారు. బీహార్ నుంచి వచ్చి సిద్దిపేట జిల్లా మైలారంలో కూలీ పనులు చేస్తూ పవన్‌కుమార్(32) జీవిస్తున్నాడు. విశ్వసనీయ సమాచారం మేరకు గౌరారం శివారులో సింగాయపల్లి చౌరస్తా వద్ద గంజాయి అమ్ముతున్న పవన్ కుమార్‌ను ఎస్‌ఐ కరుణాకర్‌రెడ్డి అదుపులోకి తీసుకున్నారు. అతడి జేబులో 100 గ్రాముల గంజాయి దొరికింది. విచారించగా కొంత కాలం నుంచి బీహార్‌కు చెందిన నితిన్‌కుమార్ వద్ద కొనుగోలు చేసి గజ్వేల్‌లోని గ్రామాల్లో అమ్ముతున్నట్లు చెప్పాడు. గంజాయి, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు.

హరిత హీరోలు

విరివిగా మొక్కలు పెంచుతున్న వృక్ష ప్రేమికులు

పెంపకంపై ఇతరులకు అవగాహన • శుభకార్యాలకు మొక్కలే బహుమతి

పచ్చదనం పంచుతున్న ఇళ్లు, కార్యాలయాలు, పాఠశాలలు

సండే స్పెషల్

అడవులు అంతరించిపోతున్న తరుణంలో పలువురు వృక్ష ప్రేమికులు సొంతంగా మొక్కలు నాటుతూ పర్యావరణాన్ని పరిరక్షిస్తున్నారు. భవిషత్ తరాలకు మంచి వాతావరణం అందించడానికి తమ ఇంటి పరిసరాలు, పని చేసే చోట, ఖాళీ స్థలాల్లో విరివిగా మొక్కలు నాటుతున్నారు. విత్తన బంతులను తయారు చేసి చల్లుతున్నారు. వృక్షాల ప్రాముఖ్యత గూర్చి సమాజంలో పలువురికి అవగాహన కల్పిస్తూ పలువురు మొక్కలు నాటేలా కృషి చేస్తున్న హరిత ప్రేమికులపై సాక్షి సండే స్పెషల్.



చేర్యాల: ఇంటి ఆవరణలో పెంచిన మొక్కలతో ఉపాధ్యాయుడు వెంకటేశ్

ఉపాధ్యాయుడి ఇల్లు.. ఉద్యాన వనం

చేర్యాల(సిద్దిపేట): పట్టణ కేంద్రంలోని శ్రీనగర్ కాలనీకి చెందిన అంబాల వెంకటేశ్‌గౌడ్, ప్రస్తుతం చుంచనకోట ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎంగా విధులు నిర్వహిస్తున్నాడు. మొక్కలంటే మక్కువ. తన ఇంటినే ఉద్యానవనంగా మార్చుకున్నాడు. ఇంటిలో నాటిన మొక్కలకు నిత్యం ఉదయం, సాయంత్రం వేళల్లో కొంత సమయం కేటాయించి వాటిని సంరక్షిస్తున్నాడు. ఖాళీ స్థలంలో మొక్కలు నాటి పెంచుతుండటంతో ఇంటి పరిసరాలు ఉద్యానవనాన్ని తలపిస్తున్నాయి. ఎర్రచందనం, శ్రీగంధం, మూడు రకాల మామిడి, రెండురకాల ఉసిరి మొక్కలతో కలుపుకొని మొత్తం 15 రకాల పండ్ల జాతి, 8 రకాల పూల మొక్కలు, కొన్ని రకాల తీగజాతి కూరగాయ తోటలు పెంచుతున్నాడు. పండ్లు, పూలు, నీడనిచ్చే, వాటిని కలుపుకుని మొత్తం 200 రకాలు మొక్కలు ఆ వనంలో ఉన్నాయి. గతంలో కేరళకు వెళ్లిన ఆయన అక్కడ ఏ ఇంటి ఆవరణ చూసినా వనంలా కనిపించడంతో అలా తన ఇంటిని కూడా ఉద్యానవనంగా మార్చుకున్నాడు.



కొల్చారం వరిగుంతం పాఠశాలలో పచ్చని చెట్ల మధ్య విద్యార్థులు, ఉపాధ్యాయులు

మొక్కవోని దీక్ష

కొల్చారం(నర్సాపూర్): పచ్చని చెట్లతో నిండి ఉపాధ్యాయులు, విద్యార్థులతో కనిపిస్తున్న ఈ ప్రదేశం మండలంలోని వరిగుంతం ఉన్నత పాఠశాల ఆవరణ. ఆరేళ్ల క్రితం హరితహారంలో భాగంగా ఆవరణలో నాటిన మొక్కలు ఏపుగా పెరిగాయి. దీంతో ఉత్తమ పాఠశాలగా ఎంపికైంది. మొక్కవోని దీక్షతో ఉపాధ్యాయులు, విద్యార్థులు మొక్కలు నాటి సంరక్షిస్తున్నారు. పాఠశాల ఆవరణ పచ్చదనంతో నింపాలన్న ఆశయంతో ముందుకు సాగుతామని ఉపాధ్యాయులు, విద్యార్థులు ప్రతిన పూనుతున్నారు.

మా ఇంటి తోట

చేగుంట(తూప్రాన్): మండలంలోని వడియారం గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ కృష్ణవేణి ఇంట్లోనే పలు రకాల మొక్కలు పెంచుతున్నారు. మొక్కల పెంపకంపై ఆసక్తితో ఆమె ఐదేళ్లుగా ఇంటి ఆవరణలో మామిడి, జామ, కరివేపాకు, మల్లె చెట్టు, శ్రీగంధం, ఎర్రచందనం, లక్ష్మణఫలం, బిర్యానీ ఆకు, తైవాన్ మామిడి, తైవాన్ జామ, అశ్వగంధం, అల్లనేరేడు, అవకాడో, అంజీర్ మొక్కలను నాటారు. వీటితోపాటు అంతర పంటగా పసుపు, వేరుశనగ పండిస్తున్నారు. ఎలాంటి రసాయనాలు వాడకుండా మొక్కలను సేంద్రీయ ఎరువులతో మాఇంటి తోటలో పెంచుతూ ఆదర్శంగా నిలుస్తున్నారు.



తోటలో పెంచుతున్న తైవాన్ మామిడి చెట్టుతో కృష్ణవేణి

కోటి మొక్కలు నాటడమే సంకల్పం



మొక్కలు నాటుతున్న జ్ఞానేశ్వర్

తయారు చేసిన విత్తన బంతులు

నారాయణఖేడ్: మనుషులు చెట్లను ఇష్టానుసారంగా నరికి వేస్తుండటంతో ప్రకృతి గతి తప్పిందని భావించాడు. కోటి మొక్కలు నాటాలని పదేళ్ల క్రితం దీక్ష బూనాడు. ఆయనే సంగారెడ్డి జిల్లా నాగల్‌గిద్ద మండలం ముక్టాపూర్ గ్రామానికి చెందిన పాలడుగు జ్ఞానేశ్వర్. కోటి మొక్కలు నాటే వరకు పాదరక్షలు ధరించబోనని శపథం చేశాడు. ఇప్పటి వరకు 3.50లక్షల మొక్కలను అడవులు, నదీ పరివాహక ప్రాంతాల్లో, దేవాలయ ప్రాంగణాలు, పాఠశాల ఆవరణలో నాటారు. విత్తన బంతులు తయారు చేసి నర్సాపూర్, మెదక్, మంజీరా నదికి ఇరువైపులా తాను చల్లడమే కాకుండా విద్యార్థులతో చల్లించారు. జ్ఞానేశ్వర్‌కు కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ సంస్థ మొక్కలను అందిస్తుంది. ఈ పర్యావరణ ప్రేమికుడికి 'సాక్షి' దినపత్రిక ఎక్స్‌లెన్స్ అవార్డును గవర్నర్ విశ్వభూషన్ హరిచందర్ చేతులమీదుగా, భారత్ యువ పురస్కార్, కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ సంస్థ ద్వారా ఎర్త్ లీడర్ అవార్డులతోపాటు సత్కారాలు పొందాడు.

ఆ పాఠశాల నందనవనం

తూప్రాన్: ఆహ్లాదం..పచ్చదనంతో పట్టణ పరిధిలోని పోతరాజుపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల నందనవనంను తలపిస్తోంది. విద్యార్థులు మొక్కలు నాటడంతో ఏపుగా పెరిగి నేడు వృక్షాలుగా దర్శనమిస్తున్నాయి. పచ్చదనం అలుముకుని చల్లని నీడతోపాటు స్వచ్ఛమైన గాలిని అందిస్తున్నాయి. గత ప్రభుత్వం చేపట్టిన హరితహారం కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ప్రతి విద్యార్థి ఒక మొక్క చొప్పున పూలు, పండ్ల మొక్కలు దానిమ్మ, జామ, కర్జూరం, బాదం, మామిడి తదితర మొక్కలు పాఠశాల ఆవరణలో నాటారు. వాటి సంరక్షణ బాధ్యతలను ఆ విద్యార్థులకు అప్పగించారు. దీంతో విద్యార్థులు మధ్యాహ్న భోజన సమయంలో మొక్కలకు నీరు పోసి సంరక్షించారు. నేడు ఆ మొక్కలే వృక్షాలై చూపరులను ఆకట్టుకుంటున్నాయి. ఉపాధ్యాయులు, విద్యార్థుల కృషిని గ్రామస్తులు అభినందిస్తున్నారు.



పోతరాజుపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో..



ఆస్పత్రి ఆవరణలో పచ్చదనం వెల్లివిరిసేలా గ్రీనరీ

ఆ ఆస్పత్రి హరిత వనం

హుస్నాబాద్: హుస్నాబాద్ ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణం చుట్టూ పచ్చదనం పరిచినట్లుగా చెట్లు, మొక్కలు దర్శనమిస్తున్నాయి. ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రమేష్ రెడ్డి వందలాది మొక్కలు నాటించారు. దాదాపు మూడేళ్ల నుంచి గ్రీనరీపై ప్రత్యేక శ్రద్ధ వహించారు. నాటిన మొక్కలను సంరక్షిస్తూ చెట్ల పెంపకంపై ప్రత్యేక దృష్టి సారించారు. ఆ మొక్కలు నేడు ఎపుగా పెరిగి ఆస్పత్రి వచ్చే రోగులకు నీడనిస్తున్నాయి. వారితో పాటు రోగులను చూడటానికి వచ్చే బంధువులు సైతం చెట్ల నీడన సేద తీరుతూ ఆహ్లాదకరమైన వాతావరణాన్ని ఆస్వాదిస్తున్నారు. పూల మొక్కలతో పాటు నీడనిచ్చే మొక్కలు పెంచుతూ ఆస్పత్రి ఆవరణను హరిత వనంగా మార్చారు. ఆస్పత్రి ప్రధాన ద్వారాల వద్ద ఏర్పాటు చేసిన పూల కుండీలు అందరిని ఆకర్షిస్తున్నాయి.

భవిషత్ తరాల కోసం నాటుదాం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): మొక్కలు నాటడం అంటే ఎంతో ఇష్టం. ఆయనే తెల్లాపూర్ జెడ్పీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తోట భాస్కర్. నిత్యం పాఠశాలలో పర్యావరణంపై విద్యార్థులకు ప్రత్యేక అవగాహన కల్పిస్తున్నారు. ప్రతి ఒక్క విద్యార్థి మొక్కలు నాటే విధంగా తన వంతు ప్రయత్నం చేస్తున్నారు. ఇప్పటి వరకు పాఠశాల ఆవరణలో 350 మొక్కలు నాటారు. గతంలో ఆయన ఎద్దుమైలారం పాఠశాలలో పని చేసిన సమయంలో 400 మొక్కలు నాటి కలెక్టర్ నుంచి గ్రీన్ స్కూల్ అవార్డును సైతం తీసుకున్నారు.



తెల్లాపూర్ పాఠశాల ఆవరణలో మొక్కలు నాటుతున్న ప్రధానోపాధ్యాయుడు భాస్కర్, విద్యార్థులు

భవిష్యత్ తరాల వారికి మంచి వాతావరణం ఇవ్వాలంటే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని పిలుపునిస్తున్నారు.



గౌసొద్దీన్ ఇంటి ఆవరణలో పెంచుతున్న మొక్కలు

మొక్కలంటే ప్రాణం



గౌసొద్దీన్

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని పస్తాపూర్ డబుల్ బెడ్రూం కాలనీలో గల గౌసొద్దీన్ ఇళ్లు పచ్చదనంతో వెల్లివిరిస్తోంది. ఆయనకు మొక్కలు పెంచడం అలవాటు. ఇంటి లోపల, బయట ఎక్కడ చూసిన వివిధ రకాల మొక్కలు, చెట్లు దర్శనమిస్తున్నాయి. వరండాలో పైకప్పు, మెట్లకు ఇరు పక్కల, ఇంటి గేటు పక్కన ఖాళీ స్థలం లేకుండా మొక్కలను పెంచడంతో ఇంటి ప్రాంగణం అంతా ఆహ్లాదకరంగా కనిపిస్తోంది. వివిధ రకాల పూలు, పండ్లు తదితర మొక్కలు దర్శనమిస్తున్నాయి. ఇక్కడి కాసిన పండ్లు ఇతరులకు ఉచితంగా అందజేస్తారు. మొక్కల పెంపకం కోసం ఆయన వేల రుపాయలు ఖర్చు చేస్తుంటారు. తనకు మొక్కలంటే ప్రాణమని, వాటి పెంపకం కోసం ప్రతి రోజు కొన్ని గంటల సమయం కేటాయిస్తానని గౌసొద్దీన్ తెలిపారు.

పచ్చని తోరణంలా ద్రాక్ష తీగ

దుబ్బాకటౌన్: ఇంటిని పచ్చని తోరణంలా ఉంచడానికి, ఎండాకాలంలో భవనాన్ని చల్లగా ఉంచడానికి , వాతావరణ కాలుష్యం నుంచి ఉపశమనం పొందడానికి పచ్చని పొదరిల్లుగా తీర్చిదిద్దింది ఓ గృహిణి. దుబ్బాక పట్టణానికి చెందిన కోమలి వినూత్న ఆలోచనతో ఇంట్లో ఉన్న తక్కువ ఖాళీ స్థలంలో ప్రత్యేక ద్రాక్ష మొక్కలను నాటింది. దీంతో వేసవి కాలంలో ఇంట్లోకి ఎండ పడకుండా చల్లగా ఉండేలా ఇంటిముందు ద్రాక్ష తీగలు పందిరిలా అల్లుకుపోయేలా ఏర్పాట్లు చేసింది. ఈ మొక్కలు తీగలా అల్లుకుని చల్లదనంతో పాటు పండ్లను సైతం ఇస్తున్నాయి. ఇంటిపై సైతం మరిన్ని మొక్కలు నాటడానికి ప్రయత్నాలు చేస్తున్నా. ఇంటి ముందే కాకుండా భవనంపై సైతం మొక్కలు నాటడానికి నూతన తరహాలో ఆలోచన చేసింది. భవనంపై ఇటీవల డ్రాగన్, కీవీ మొక్కలు నాటింది

ఇంటి ముందు పందిరిలా అల్లుకున్న ద్రాక్ష చెట్టుతో కోమలి



హరితం ఆయన అభిమతం



మొక్కలకు నీరు పడుతున్న నాగరాజు

సిద్దిపేటజోన్: పట్టణానికి చెందిన రాదారి నాగరాజు ప్రభుత్వ ఉపాధ్యాయుడు. విద్యార్థులకు విద్యాబుద్ధులు చెప్పడంతో పాటు మొక్కల పెంపకం, వృక్షాల ప్రాముఖ్యత గూర్చి కొన్నేళ్లుగా అవగాహన కల్పిస్తున్నారు. ఇరుకోడ్ మోడల్ స్కూల్‌లో సుమారు 3వేల మొక్కలు నాటి హరితహారంలో రాష్ట్ర స్థాయిలో ఉత్తమ పాఠశాల అవార్డు సాధించేలా కృషి చేశారు. తన ఇంటిని సైతం 300 మొక్కలతో నింపేశారు. మిద్దె తోటల పెంపకాన్ని సిద్దిపేటలో విస్తరించారు. పాఠశాలలో వృక్షా బంధన్ పేరిట చెట్లకు పిల్లలతో రాఖీ కట్టించి మొక్కల గూర్చి ప్రచారం చేశారు. సెమినార్, శిక్షణ తరగతులలో మొక్కల పెంపకం గూర్చి వివరించారు. శుభకార్యాలకు మొక్కను బహుమతిగా ఇవ్వడం ఆయన ఆనవాయితీగా మార్చుకున్నారు.

13 బైకులు స్వాధీనం

బైక్ దొంగలు అరెస్ట్

జహీరాబాద్ టౌన్: పార్కింగ్ చేసిన బైకులను తస్కరించిన కేసులో ముగ్గురిని శనివారం పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి రూ.10 లక్షల విలువ చేసే 13 బైకులను స్వాధీనం చేసుకున్నారు. జహీరాబాద్ డీఎస్పీ సైదానాయక్, టౌన్ సీఐ.శివలింగంతో కలిసి స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. కర్నాటక రాష్ట్రంలోని బీదర్ పట్టణానికి చెందిన ఎండీ.ఫారూక్(19), అంజద్‌పాషా(26), లాహెఖ్(22) పార్కింగ్ చేసిన బైకులను చోరీ చేస్తున్నారు. నాలుగేళ్ల నుంచి జహీరాబాద్, సంగారెడ్డి, సదాశివపేట, హైదరాబాద్‌లో పలు బైకులను అపహరించారు. ఈ క్రమంలో పోలీసులు జాతీయ రహదారి 65పై బీదర్ చౌరస్తా వద్ద వాహనాలు తనిఖీ నిర్వహించగా బైక్‌పై వెళ్తున్న యువకులను అనుమానంతో ఆపారు. అదుపులోకి తీసుకొని విచారించగా బైకులను చోరీ చేస్తున్నట్లు ఒప్పుకున్నారు. వారి నుంచి బైకులను స్వాధీనం చేసుకున్నారు. వీరు పలు దొంగతనం కేసుల్లో జైలుకు కూడా వెళ్లివచ్చారని పోలీసులు తెలిపారు. కేసును ఛేదించిన టౌన్ సీఐ.శివలింగం, ఎస్‌ఐ.వినయ్‌కుమార్, ఐడీ పార్టీ సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.



నిందితులు చోరీ చేసిన బైకులు, చిత్రంలో పోలీసులు

పురుగుల మందు తాగి ఆత్మహత్య

రామాయంపేట(మెదక్): ఆర్థిక సమస్యలతో వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన రామాయంపేట మున్సిపాలిటీ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు... పట్టణానికి చెందిన కుమ్మరి భూమయ్య (48) కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఆర్థిక సమస్యలతో సతమతమవుతున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి తన ఇంట్లో క్రిమి సంహారక మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి, అక్కడి నుంచి హైదరాబాద్‌కు తరలించారు. చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మద్యానికి బానిసై..

పటాన్‌చెరు టౌన్: మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... మెదక్ జిల్లా శంకరంపేటకు చెందిన శ్రీను(36) కుటుంబ సభ్యులతో కలిసి రెండు నెలల క్రితం వచ్చి పటాన్‌చెరు మండలం ఇంద్రేశంలోని అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో శ్రీను శుక్రవారం కుమారుడు బాలరాజ్ (4)కు జ్వరం రావడంతో భార్య స్వరూపను పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లమని చెప్పగా ఆమె వెళ్లింది. తిరిగి ఇంటికి వచ్చేసరికి భర్త ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని కనిపించాడు. స్థానికుల సహాయంతో కిందికి దింపి చూడగా అప్పటికే మృతి చెందాడు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించారు. తన భర్త రోజు మద్యం తాగుతాడని, గతంలో మద్యం తాగి మూడు సార్లు ఉరివేసుకునేందుకు ప్రయత్నించాడని భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

• ట్రాన్స్‌ఫార్మర్లు పగలగొట్టి కాపర్ వైర్ చోరీ
• అంతర్రాష్ట్ర నిందితుల్లో ఇద్దరి అరెస్టు.. పరారీలో ముగ్గురు
• 227కేజీల కాపర్ వైర్, 3లక్షల నగదు స్వాధీనం
• కేసు వివరాలు వెల్లడించిన సీపీ అనురాధ

జల్సాలకు అలవాటు పడి..

సిద్దిపేటకమాన్: ట్రాన్స్‌ఫార్మర్లను పగలగొట్టి అందులోని కాపర్ వైరును దొంగిలిస్తున్న ముఠాలోని ఐదుగురు నిందితుల్లో ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ ఘటన సిద్దిపేట జిల్లాలో చోటు చేసుకుంది. పోలీసు కమిషనర్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో సీపీ అనురాధ కేసు వివరాలు వెల్లడించారు. కొండపాక మండల కేంద్రంలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను పగులగొట్టి కాపర్ వైర్‌ను గుర్తు తెలియని వ్యక్తులు మే 27న చోరీ చేసినట్లు విద్యుత్‌శాఖ ఏఈ కుకునూరుపల్లి పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. అలాగే జిల్లాలో మరికొన్ని గ్రామాల్లో కూడా ఇదే తరహా ఘటనలు చోటు చేసుకోవడంతో రైతులు విద్యుత్ సమస్యతో పొలాల దగ్గర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో గజ్వేల్ ఏసీపీ నరసింహులు ఆధ్వర్యంలో తొగుట సీఐ లతీఫ్, కుకునూర్‌పల్లి ఎస్‌ఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ప్రత్యేక టీమ్ ఏర్పాటు చేసి కేసు దర్యాప్తు చేపట్టారు. రాజస్థాన్ రాష్ట్రం భరత్‌పూర్ జిల్లాలోని ఝూనతి గ్రామానికి చెందిన మహమ్మద్ అజారుద్దీన్ (27), మహమ్మద్ షాకీర్ (28), తెలీమ్‌ఖాన్, సలీమ్ అలియాస్ సోహెల్, అక్రమ్ సిద్దిపేట జిల్లాతో పాటు చుట్టుపక్కల జిల్లాల్లో జేసీబీ డ్రైవర్లుగా పనిచేస్తున్నారు. వీరు జల్సాలకు అలవాటు పడి సులభంగా డబ్బులు సంపాదించాలనే ఆలోచనతో ఐదుగురు ముఠాగా ఏర్పడ్డారు. పగలు రెక్కీ నిర్వహించి రాత్రి సమయంలో ఇద్దరు నిందితులు ద్విచక్ర వాహనంపై వచ్చి ట్రాన్స్‌ఫార్మర్లను పగులగొట్టి అందులోని కాపర్ వైర్‌ను దొంగిలిస్తున్నారు. వీరికి మరో ముగ్గురు నిందితులు సహకరించే వారు. దొంగిలించిన కాపర్ వైర్‌ను హర్యానా, ఇతర ప్రాంతాల్లో స్క్రాప్ షాపలలో విక్రయిస్తూ వచ్చిన డబ్బులతో జల్సాలు చేస్తున్నారు.



రికవరీ చేసిన కాపర్ వైర్‌ను చూపుతున్న పోలీసు అధికారులు

185 కేసుల్లో నిందితులు..

కొన్ని నెలలుగా సిద్దిపేట జిల్లాతో పాటు ఇతర జిల్లాల్లో మొత్తం 185 ట్రాన్స్‌ఫార్మర్లు పగలగొట్టి కాపర్ వైర్ చోరీ చేసినట్లు పలు పోలీసు స్టేషన్‌లలో నిందితులపై 185 కేసులు నమోదయ్యాయి. నాలుగు నెలలుగా సిద్దిపేట జిల్లాలో 26, మెదక్‌లో 34, కరీంనగర్ జిల్లాలో 19, వరంగల్ జిల్లాలో 63, రాచకొండ కమిషనరేట్ పరిధిలో 40, సైబరాబాద్ పరిధిలో 2, పెద్దపల్లి జిల్లాలో ఒక ట్రాన్స్‌ఫార్మర్ పగులగొట్టి కాపర్ వైరును తస్కరించారు. అజారుద్దీన్ 49 కేసుల్లో నిందితుడిగా ఉండటంతో పాటు షామీర్‌పేట పీఎస్ పరిధిలో జరిగిన ఓ కేసులో రెండేళ్ల జైలు శిక్ష అనుభవించాడు. టెక్నాలజీ సాయంతో నిందితులను గుర్తించి వారిలో మహమ్మద్ అజారుద్దీన్, మహమ్మద్ షాకీర్‌లను రిమాండ్‌కు తరలించారు. వారి వద్ద నుంచి 272 కేజీల కాపర్ వైర్, రూ.3,24,700 నగదుతో పాటు ఒక ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నామని సీపీ తెలిపారు. పరారీలో ఉన్న ముగ్గురిని త్వరలో పట్టుకుంటామన్నారు. టెక్నాలజీ సాయంతో నిందితులను అరెస్టు చేయడంలో కీలకపాత్ర వహించిన సీఐ లతీఫ్, ఎస్‌ఐ శ్రీనివాస్, బేగంపేట ఎస్‌ఐ మహిపాల్‌రెడ్డి, హెడ్ కానిస్టేబుళ్లు మధుసూదన్‌రెడ్డి, రమణ, ఐటీ కోర్ సిబ్బంది శ్రీకాంత్, రమేష్, కానిస్టేబుల్స్‌ను అభినందించి, నగదు రివార్డు అందజేశారు.